సాక్షి నల్లగొండ

మంగళవారం, 18, ఏప్రిల్, 2023



భూదాన అంకురార్పణకు 72ఏళ్లు

భూదానోద్యమానికి అంకురార్పణ జరిగి నేటికి సరిగ్గా 72 సంవత్సరాలు పూర్తయ్యాయి.

- 8లో



చివరి గింజ వరకూ కొనుగోలు

రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం
43° / 24°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రతి ఫిర్యాదుపై సమగ్ర నివేదిక



గ్రీవెన్స్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ప్రతి ఫిర్యాదుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్పీ అపూర్వరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఆమె మాట్లాడారు. ఫిర్యాదులను స్వీకరించి కిందిస్థాయి అధికారులను సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. భార్యభర్తల వివాదాలు, ఆస్తి వివాదాలు శాంతి భద్రతల సమస్యగా మారకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) బేగంపేట, రామంతపూర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో అడ్మిషన్లకు అర్హులైన ఎస్సీ విద్యార్థులు మే 1వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సల్మాబాను సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫరాలు ఎస్సీ కులముల అభివృద్ధి శాఖ జిల్లా కార్యాలయంలో లభిస్తాయని.. మే 5వ తేదీన విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ప్రచార యాత్రలో పాల్గొన్న నాయకులు

డిండి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి, బ్రాహ్మణపల్లి, వావిల్‌కోల్, రుద్రాయగూడెం, రహమంతాపూర్, సింగరాజుపల్లి, వీరబోయనపల్లి, శక్రుతండా, రత్నతండా, గజరాల్‌తండాల్లో కొనసాగిన సీపీఐ ఇంటింటి ప్రచార యాత్రలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్ల పనులను వెంటనే పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, బి.వెంకటరమణ, ఎండీ.మైనొద్దీన్, తూం బుచ్చిరెడ్డి, ఎస్ఆర్.కనకాచారి, బి.శైలేష్, శ్రీనయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ గాయత్రి హవనం

యాదగిరిగుట్ట : పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండనామ ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహాయజ్ఞం సోమవారం 22వ రోజు కొనసాగింది. ఉదయం ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీతో పాటు కొండపాక పీఠాధిపతి వీరదర్మేంద్రస్వామిజీ, మంగునూరు పీఠాధిపతి విశ్వత్మాస్వామిజీ, నందగిరి స్వామిజీలు జాతీయ జెండా, కాషాయం జెండాలతో యాదాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆశ్రమంలో పూజలు నిర్వహించారు. ఇక మధ్యాహ్నం సర్వ కర్మ, గ్రహదోషాల నుంచి విముక్తి, దుష్టిశక్తి నివారణం, అన్ని రంగాల్లో విజయం సాధించాలని శ్రీ ఆంజనేయగాయత్రి హవనం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో రామాంజనేయులు, ఆరె స్వామిగౌడ్, గుజ్జ శ్రీశైలం, రాధమ మధుమంజరీ మాతా తదితరులు పాల్గొన్నారు. యాదాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు.

37,078 మందికి గొర్రెలు

- నెలాఖరులోగా పంపిణీ చేసేలా సన్నాహాలు
- ప్రతి లబ్ధిదారుడుకి 20 గొర్రెలు, ఒక పొట్టేలు
- జిల్లాస్థాయి అధికారులకు జీవాల కొనుగోలు బాధ్యత
- 9 బృందాలను ఏర్పాటు చేసిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అత్యధికంగా జిల్లాలోనే..

నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా గొర్రెలను పంపిణీ చేయబోతున్నారు. రాష్ట్రం మొత్తంగా చూస్తే నల్లగొండ జిల్లాలోనే 12 శాతం గొర్రెలను పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇక్కడే అత్యధికంగా 37,078 లబ్ధిదారులకు గొర్రెల యూనిట్ల ద్వారా లబ్ధి చేకూరనుంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా వచ్చే 15 రోజుల్లోగా గొర్రెల కొనుగోలును పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. అందుకు అవసరమైన లారీల టెండర్ ఫైనాన్షియల్ బిడ్‌ను సోమవారం ఓపెన్ చేశారు. ఒకటీ రెండు రోజుల్లో టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తి కానుంది. మొత్తంగా ఈ నెలాఖరుకు లేదా వచ్చే నెల మొదటి వారంలో జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు 37,078 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో యూనిట్ కింద లబ్ధిదారులకు 20 గొర్రెలు, ఒక పొట్టేలును పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించిన వెంటనే జిల్లాలోనూ పంపిణీ చేయనున్నారు.

సీనియర్ అధికారులకు బాధ్యతలు..

గొర్రెల కొనుగోళ్ల విషయంలో ఇదివరకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పొరపాట్లు దొర్లడం, గొర్రెల నాణ్యత విషయంలో రాజీ పడడం వంటి విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈసారి అలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో తహసీల్దార్లు, వెటర్నరీ డాక్టర్లు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసి తీసుకొచ్చేవారు. అయితే ఈసారి జిల్లా స్థాయి సీనియర్ అధికారుల నేతృత్వంలోనే గొర్రెలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సీనియర్ అధికారుల నేతృత్వంలో మరో ఇద్దరు అధికారులతో జిల్లాలో మొత్తం 9 బృందాలను ఏర్పాటు చేశారు. ఏ జిల్లాకు అవసరమైన గొర్రెలను ఎక్కడ కొనుగోలు చేయాలనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

అనంతపురం, కడప జిల్లాల్లో..

నల్లగొండ జిల్లాలో పంపిణీ చేయనున్న గొర్రెలను ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడప జిల్లాల్లో కొనుగోలు చేయనున్నారు. అక్కడి నుంచి తీసుకొచ్చిన గొర్రెలకు వేసవి ఎండల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యతలను స్థానిక వెటర్నరీ అధికారులు, తహసీల్దార్లకు అప్పగించారు. మరోవైపు అర్హులైన ఒక్కో లబ్ధిదారులు తమ వాటా ధనం కింద రూ.43,750 చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించేలా చర్యలు చేపట్టారు. లబ్ధిదారుల ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం, నామినీ వివరాలు, కులం పరిశీలన పనులను ఇప్పటికే మండల స్థాయి అధికారుల బృందాలు చేపట్టాయి. మొత్తంగా ఈనెలాఖరుకు జిల్లాకు గొర్రెలు రానున్నాయి. అవి వచ్చిన వెంటనే నెలాఖరుకు లేదా మొదటివారంలో ప్రజా ప్రతినిధుల నేతృత్వంలో లబ్ధిదారులకు పంపిణీని ప్రారంభించనున్నారు. వాటా ధనం చెల్లించిన వారందరికీ గొర్రెల యూనిట్లను అందజేయనున్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు: కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

గొర్రెల కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. గొర్రెల పంపిణీపై సోమవారం జిల్లాస్థాయి అధికారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసే గొర్రెలు లబ్ధిదారులు సంతృప్తి చెందేలా ఉండాలని జిల్లా స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు. గొర్రెలు రీ సైక్లింగ్ లేకుండా, చెవులకు రంధ్రాలు లేకుండా, వయస్సు ఇతర మార్గదర్శకాలు అవగాహన చేసుకొని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

అనుభవం ఉన్న వారికే ప్రాధాన్యం..

దూర ప్రాంతాల నుంచి గొర్రెలను తరలించాల్సి ఉన్నందున తరలింపులో అనుభవం కలిగిన లారీల సంస్థలనే ఎంపిక చేసేలా చర్యలు చేపట్టారు. గతంలో గొర్రెల తరలింపులో ఎలా పని చేశారనే అంశాలతో పాటు వారి పనితీరు సర్టిఫికెట్ చూస్తున్నారు. గతంలో డీఫాల్ట్ అయ్యారా? అనే విషయాన్ని చెక్ చేస్తున్నారు. అలాంటి వారికి ఈసారి గొర్రెల తరలింపు బాధ్యతలు ఇవ్వొద్దని నిర్ణయించారు. మొత్తంగా లారీల నిర్వహణ సంస్థలు 9 టెండర్లు దాఖలు చేశాయి. వాటి ఫైనాన్షియల్ బిడ్‌ను సోమవారం తెరిచారు. అందులో కనీసంగా 20 నుంచి 30 వాహనాలు కలిగి, అన్ని అర్హతలు ఉన్న వారికి గొర్రెల సరఫరా బాధ్యతలను ఒకటీ రెండు రోజుల్లో అప్పగించనున్నారు.

మూడు రోజుల్లోనే ధాన్యం డబ్బులు



చందనపల్లి కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- రైతుల ఖాతాల్లో రూ.60 లక్షలు జమ
- ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

నల్లగొండ : కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వాటితోపాటు గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్ముకున్న ధాన్యానికి మూడు రోజుల్లోనే రైతులకు డబ్బులు అందుతున్నాయి. ప్రభుత్వం జిల్లాకు సోమవారం రూ.60 లక్షల విడుదల చేయగా వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేశారు.

13వ తేదీన కొనుగోళ్ల ప్రారంభం..

జిల్లాలో మొత్తం 272 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈనెల 13వ తేదీ నుంచి ఇప్పటివరకు పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో 200 కేంద్రాల వరకు ప్రారంభించారు. వాటి ద్వారా 6,000 పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయించడం, వాటిని రాష్ట్రస్థాయి అధికారులకు పంపుతుండడంతో జిల్లాకు రూ.60 లక్షలు విడుదల చేశారు. వాటిని జిల్లా అధికారులు రైతుల ఖాతాల్లో జమ చేశారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ..

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సోమవారం జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి నల్లగొండ, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు నల్లగొండలోని బత్తాయి మార్కెట్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలు తెలుసుకోవడంతోపాటు సంబంధిత అధికారులు, సిబ్బందికి కొనుగోళ్ల విషయంలో తగు సూచనలు చేశారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ, దరణి, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పింఛన్లు, పంచాయతీ రాజ్, ఇతర శాఖలకు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేస్తున్నాయ్

- పునః ప్రారంభం నాటికి పాఠశాలలకు చేర్చేలా సన్నాహాలు
- 9.15 లక్షల పుస్తకాలకుగాను.. ఇప్పటికే 1.57 లక్షలు జిల్లాకు రాక
- క్యూఆర్ కోడ్‌తో ముద్రణ
- ఈ ఏడాది ముందే మేల్కొన్న విద్యాశాఖ



డిపో వద్ద పుస్తకాలు దింపుతున్న సిబ్బంది

నల్లగొండ : గతేడాది పాఠ్యపుస్తకాల్లో జరిగిన జాప్యాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ ఈసారి ముందే మేల్కొంది. పాఠ్యపుస్తకాల ముద్రణను రెండు నెలల క్రితమే ప్రారంభించి వాటిని జిల్లాలకు సరఫరా చేస్తోంది. స్కూళ్ల పునః ప్రారంభమయ్యే నాటికి అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. జిల్లాకు 9,15,300 పుస్తకాలు అవసరం ఉండగా లక్షా 57వేల పుస్తకాలు ఇప్పటికే జిల్లాకు చేరాయి. సోమవారం సాయంత్రం కూడా రెండు లారీల్లో పాఠ్యపుస్తకాలు వచ్చాయి.

జిల్లాలో పాఠశాలలు..	
ప్రైమరీ స్కూల్స్	1126
యూపీఎస్‌లు	128
హైస్కూల్స్	229
కస్తూరిబా స్కూల్స్	27
మోడల్ స్కూల్స్	17

గతేడాది ముద్రణలో జాప్యం

ప్రభుత్వం గత సంవత్సరం 5 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల బోధనను ప్రారంభించింది. దీంతో ఒకే పుస్తకంలో ఒక వైపు తెలుగు, మరో వైపు ఆంగ్ల పాఠ్యాంశాన్ని ముద్రించారు. దీంతో ముద్రణలో జాప్యం జరిగి పాఠశాలలు ప్రారంభమైన మూడు, నాలుగు మాసాల వరకు కూడా పూర్తిస్థాయిలో పుస్తకాలు అందలేదు. దీంతో కొన్ని టైటిల్స్ లేకుండానే బోధన ప్రారంభమైంది. పుస్తకాలు సరైన సమయంలో అందక కొన్ని ప్రాంతాల్లో సిలబస్ కూడా పూర్తికాలేదు. దాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ ఈ సంవత్సరం ముందుగానే ముద్రణను ప్రారంభించింది.

డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం..

ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు బహిరంగ మార్కెట్‌లో అమ్మడానికి వీల్లేకుండా ప్రతి పుస్తకానికి క్రమ సంఖ్యతోపాటు క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రిస్తున్నారు. దీక్ష యాప్ ద్వారా పిల్లలు ఆ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పాఠ్యాంశం అంతా డౌన్‌లోడ్ అయి చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. గత సంవత్సరం 5 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల బోధన ప్రారంభించగా ఈసారి 4, 9 తరగతులకు కూడా ఆంగ్ల బోధన ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

వేసవి సెలవుల్లో పుస్తకాలన్నీ వస్తాయి

పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికే అన్ని స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తాం. రెండు నెలల నుంచే జిల్లాకు పుస్తకాలు వస్తున్నాయి. ఈ వేసవి సెలవుల్లో పుస్తకాలు అన్ని జిల్లాకు వచ్చేస్తాయి. గత సంవత్సరం ముద్రణ ఆలస్యం కావడం వల్ల ఈసారి ముందు నుంచే ముద్రణ ప్రారంభించారు.

– వెంకటాచారి, బుక్ డిపో మేనేజర్

దుశ్చర్ల సత్యనారాయణకు తెలుగు రత్న అవార్డు



మోతె: జలసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణకు తెలుగు రత్న అవార్డు దక్కింది. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన దుశ్చర్ల సత్యనారాయణ సామాజిక కార్యక్రమాలతో పాటు అడవుల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు కృషిచేశారు. ఇందుకు తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విజయవాడలో పట్టణంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో దుశ్చర్లకు తెలుగురత్న అవార్డు అందజేశారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి నిత్య పూజలు చేసిన అనంతరం మండపంలో రుద్ర హవనం చేపట్టారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు, గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య కైంకర్యాలు కొనసాగాయి. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ అవార్డు అందుకున్న ఏపూర్ సర్పంచ్



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపూర్ సర్పంచ్ రజిత, చిత్రంలో అదనపు కలెక్టర్, కార్యదర్శి

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు సర్పంచ్ సానబోయిన రజితసుధాకర్ సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మహిళా స్నేహపూర్వక పంచాయతీ విభాగంలో జాతీయ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారంతోపాటు కోటి రూపాయల నగదు అందుకున్నారు. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలక ఉమారాణిలతో కలిసి ఆమె ఈ పురస్కారం, నగదు అందుకున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, జిల్లా అధికారులతో కలిసి లైవ్‌లో తిలకించి కరతాళ ధ్వనులతో శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఏపూరు.. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దత్తత గ్రామమైన విషయం తెలిసిందే. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పంచాయతీ అధికారి ఎస్.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

• జీజీహెచ్‌లో జనం బారులు



నల్లగొండలోని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఓపీ సేవల కోసం బారులుదీరిన జనం

– సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

త్రీడీ బోర్ పాయింట్

- కొత్త టెక్నాలజీతో భూగర్భంలో నీటి గుర్తింపు
- జిల్లా రైతులకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం
- వెయ్యి ఫీట్ల లోతు వరకు నీటిని చూసేలా పరికరం



త్రీడీ మిషన్‌తో వ్యవసాయ భూమిలో బోరు పాయింట్ చూస్తున్న యువకులు

నల్లగొండ టూటౌన్ : భూ గర్భంలో ఉండే నీటిని గుర్తించేందుకు ఇటీవల అధునాతన సాంకేతిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఈ త్రీడీ టెక్నాలజీతో వెయ్యి అడుగుల లోతులో ఉన్న నీటి వనరులను సైతం గుర్తిస్తున్నారు. ఇప్పుడు ఈ టెక్నాలజీ నీలగిరి పట్టణంలో కూడా అందుబాటులోకి వచ్చింది. ఈ త్రీడీ టెక్నాలజీ (మిషన్) పరికరాల ద్వారా భూగర్భంలో ఎంత లోతులో నీరు ఉందనే విషయాన్ని గుర్తించనున్నారు. 1000 ఫీట్ల లోతు వరకు ఎక్కడ బండ ఉంది.. ఎక్కడ ఇసుక వస్తుంది.. ఎన్ని అడుగుల కింద నీరు ఉంది.. ఎక్కడ రాళ్లు ఉన్నాయి అని కూడా తెలుసుకునే వీలుంది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నీటి వసతిని గుర్తించే అవకాశం ఉన్నందున రైతున్నలకు ఎంతో మేలు జరుగనుంది. రైతులతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఇంట్లో వేసే బోర్లకు సైతం ఈ త్రీడీ టెక్నాలజీని వినియోగించి నీటి వసతిని తెలుసుకుంటున్నారు. ఇప్పుడు మార్కెట్‌లోకి త్రీడీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినందున రైతులకు ఖచ్చితంగా భూమిలో ఎక్కడ నీటి వసతి ఉందో తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

ఖర్చు తక్కువే..

ఐదారు ఎకరాల వ్యవసాయ భూమిలో త్రీడీ టెక్నాలజీ మిషన్‌తో బోరు పాయింట్ చూడాలంటే హైదరాబాద్ నుంచి వచ్చే వారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటున్నారు. నీలగిరి పట్టణంలో మాత్రం సమీప ప్రాంతం అయితే ఐదారు వేల రూపాయల వరకు తీసుకుంటున్నారు. దూర ప్రాంతం అయితే వాహన డీజిల్ ఖర్చు కోసం అదనం మరో రూ.రెండు వేలు ఖర్చు కానున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

దగ్గర ఉండి బోరు వేయిస్తాం

త్రీడీ మిషన్ టెక్నాలజీ ద్వారా ఖచ్చితంగా నీటి వసతి ఎక్కడ ఉందనే విషయాన్ని తెలుసుకోవచ్చు. వెయ్యి ఫీట్ల లోతు వరకు ఎక్కడ బండ, ఇసుక, రాళ్లు ఉందనే విషయం కూడా తెలుస్తుంది. ఖచ్చితంగా నీరు పడుతుంది. అవసరమైన వారికి దగ్గర ఉండి కూడా బోరు వేయిస్తాం. వివరాలకు 9704144644 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

– మాదిరెడ్డి విక్రమ్‌రెడ్డి, నల్లగొండ

కొబ్బరికాయలు, కోడిగుడ్ల కాలానికి చెక్..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కువగా కొబ్బరికాయలతో బోరు పాయింట్ చూసే వారి వైపు మొగ్గు చూసే వారు. అదే విధంగా తంగేడు పుల్లలు, కోడి గుడ్లతో కూడా కొన్ని ప్రాంతాల్లో బోరు పాయింట్‌లు చూసే వారు ఉన్నారు. వీటి ద్వారా చూసిన కొందరికి బోర్లు వేయిస్తే నీరు రాగా, మరి కొందరికి మాత్రం దుమ్ము, బండ మాత్రమే వచ్చేవి. ఒక్క బోరు పడకున్నా రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు రైతులు నష్టపోయేవారు. ఒక్కో రైతు మూడు నాలుగు బోర్లు వేసి నీరు పడక ఆర్థికంగా కూడా చితికిపోయారు. ప్రస్తుత త్రీడీ టెక్నాలజీ మిషన్‌తో ఇక కొబ్బరికాయలు, తంగేడు పుల్లలు, కోడి గుడ్ల లాంటి వాటికి చెక్ పడనుంది.

ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయండి

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంలో నిర్మిస్తున్న కాంతి ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి ఫార్మా వ్యతిరేక కమిటీ నాయకులు వినతిపత్రం అందించారు. కంపెనీ నిర్మాణ పనులు ఆపేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ కోర్టు ద్వారా స్టే తెచ్చుకుని యాజమాన్యం పనులు ప్రారంభించిందని వివరించారు. మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారని బీఆర్ఎస్ కన్వీనర్ ఇడెం కైలాసం పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమగాని మల్లేశం, బీజేపీ నాయకుడు రావుల పర్వతాలు, సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు బైకులను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మునగాల (కోదాడ): 65వ నంబర్ జాతీ యర హదారిపై మునగాల మండలం పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు అతివేగంగా ముందు వెళ్తున్న రెండు బైకులను మండలంలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెన్‌పహాడ్ మండలం సైదాబాసుగూడెం గ్రామానికి చెందిన సముద్రాల చంద్రయ్య, కొండేటి గోపిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు మండలంలోని కలకోవలో తమ బంధువు దశదినకర్మకు హాజరై తిరిగి స్వగ్రామం వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను 108వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీకొని..

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయలు నార్కట్‌పల్లి : రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కామినేని ఫ్లైఓవర్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు స్లో కామినేని ఆస్పత్రి వద్ద స్లో కావడంతో వెనుక నుంచి అతివేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టింది. రెండు వాహనాల్లో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

భూదాన అంకురార్పణకు 72ఏళ్లు

- ఆర్థిక అసమానతలు తొలగించిన భూదానం
- భూదానోద్యమం ద్వారానే దేశంలో భూసంస్కరణలు


వినోబాభావేతో మాట్లాడుతున్న వెదిరె రామచంద్రారెడ్డి (ఫైల్)


భూదాన్ పోచంపల్లిలోని వినోబాభావే, వెదిరె రామచంద్రారెడ్డిల కాంస్యవిగ్రహాలు

భూదాన్‌పోచంపల్లి : భూదానోద్యమం అంకురార్పణ జరిగి నేటికి సరిగ్గా 72 ఏళ్లు పూర్తి అయ్యాయి. సెంట్ భూమి కోసం కురుక్షేత్ర యుద్ధాలు జరిగిన మన దేశంలో అడిగిందే తడవుగా వెదిరె రాంచంద్రారెడ్డి ఒకటి, కాదు రెండు కాదు ఏకంగా 100ఎకరాల భూమి దానంగా ఇవ్వడం ప్రపంచ చరిత్రలోనే పోచంపల్లిలో 1951 ఏప్రిల్ 18న జరిగింది. ఈ ఘటన దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అయ్యింది. దాంతో పోచంపల్లికి భూదాన గంగోత్రిగా అంతర్జాతీయ ఖ్యాతి లభించింది.

స్ఫూర్తినిచ్చిన భూదానం..

గాంధీజీ శిష్యుడైన ఆచార్య వినోబాభావే దేశమంతటా పాదయాత్రలు చేస్తున్న సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్15న హైదరాబాద్ సమీపంలోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. ఆ సమయంలో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న కల్లోల పరిస్థితులను తెలుసుకొని పరిష్కార మార్గాన్ని కనుగొనడానికి వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17న పోచంపల్లికి చేరుకున్నారు. సాయంత్రం హరిజనవాడలో తిరిగి ఆ రోజు రాత్రి పీర్ల కొట్టం(ఇప్పుడున్న వినోబాభావే మందిరం)లో బస చేశారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న చెరువు సమీపంలో నున్న జువ్విచెట్టు కింద దళితులతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమిని ఇప్పిస్తే సాగు చేసుకొని జీవిస్తామని దళితులంతా తమ గోడును వెల్లబోసుకున్నారు. దాంతో వినోబాభావే స్పందిస్తూ, మీలో ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారని అడగటంతో అక్కడే ఉన్న పోచంపల్లికి చెందిన వెదిరె రామచంద్రారెడ్డి వెంటనే లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100ఎకరాల భూమిని దానం చేస్తానని ప్రకటించి అక్కడికక్కడే దానపత్రాన్ని రాసి నిండుసభలో వినోబాభావేకు అందించారు. దానరూపేణ లభించిన ఆ భూమిని వెంటనే పేదలకు పంచి భూదానోద్యామానికి బీజం వేశారు. ఇలా ప్రారంభమైన భూదానోద్యమ స్ఫూర్తి విశ్వవ్యాప్తమై పోచంపల్లికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇలా 100 ఎకరాల్తో మెదలైన ఈ ఉద్యమం దేశమంతటా విస్తరించి 44లక్షల ఎకరాల భూమిని దానంగా సేకరించి 40లక్షల మంది భూమి లేని నిరుపేదలకు పంచిపెట్టబడింది. మహోన్నతమైన భూదానోద్యమం భూ సంస్కరణలకు, దేశంలో ఆర్థిక అసమానతలు తొలగడానికి దోహదపడింది.

పోచంపల్లితో విడదీయని అనుబంధం

ఆచార్య వినోబాభావేకు పోచంపల్లితో విడదీయని అనుబంధం ఉంది. మొదటిసారి 1951లో పోచంపల్లికి వచ్చారు. అలాగే 1956 గాంధీ వర్ధంతి జనవరి 30న రెండోసారి వచ్చారు. భూదానోద్యమానికి కార్యోన్ముఖునిగా చేసిన పోచంపల్లిని భూదాన గంగోత్రిగా అభివర్ణిస్తూ తన రెండో జన్మస్థలంగా వినోబాభావే పేర్కొనడం విశేషం. వినోబాభావే మరణాంతరం భారత ప్రభుత్వం ఆయన అవిశ్రాంత కృషికి గాను 1982లో 'భారతరత్న' బిరుదును ప్రకటించింది.

వెదిరె విగ్రహం ఏర్పాటు చేయాలని..

భూదానోద్యమం ద్వారా మన జిల్లా, రాష్ట్రం, తద్వారా దేశానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చిపెట్టిన వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ఇటీవల వారి వారసులు మంత్రి జగదీశ్‌రెడ్డిని స్వయంగా కలిసి విన్నవించారు. అలాగే కేంద్రం వెదిరె రాంచంద్రారెడ్డి పేరిట తపాల బిళ్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదరణకు నోచుకొని వినోబాభావే మందిరాన్ని టూరిజం పార్క్‌తో అనుసంధానం చేసి అభివృద్ధి పర్చాలని ప్రజలు కోరుతున్నారు.


భూదాన్ పోచంపల్లిలోని భూదాన స్థూపం

నేడు పోచంపల్లిలో ర్యాలీ..

తెలంంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం భూదానం జరిగిన పట్టణ కేంద్రంలోని వినోబాభావే మందిరం సమీపంలో గల జువ్వి చెట్టు నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు భూహక్కుల ఉద్యమకారుల ర్యాలీ నిర్వహించనున్నామని సమాఖ్య ప్రతినిధి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. భూమి హక్కులకు, హద్దులకు స్పష్టత, భద్రత, భూహక్కుల చిక్కులు, ధరణి సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ ఒగ్గు కళాకారులచే నృత్య విన్యాసాలుంటాయని చెప్పారు.

మాస్కులు ధరించి.. హుండీలు పగులగొట్టి..

- సాగర్‌లో నాలుగు ఆలయాల్లో చోరీ


అయ్యప్ప స్వామి ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నాగార్జునసాగర్: గుర్తుతెలియని వ్యక్తులు ముఖాలు మాస్కులు ధరించి నాలుగు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. నాగార్జునసాగర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో రోడ్డు వెంట ఉన్న అయ్యప్ప స్వామి, డౌన్‌పార్కు వద్ద గలముత్యాలమ్మ, పైలాన్‌కాలనీలోని పోచమ్మగుడి, రామాలయాల్లోకి ఆదివారం రాత్రి దుండగులు ప్రవేశించారు. ఆలయాల్లోని హుండీలను పగులగొట్టి భక్తులు సమర్పించిన కానుకలు, నగదును అపహరించుకుపోయారు. కాగా, చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఉదయం స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆలయాలను సందర్శించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

చౌటుప్పల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శివాజీనగర్‌కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన కె.బాలరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం సొంత పని మీద హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంట్లోని అక్వేరియం చేపలకు ఆహారం అందించే నిమిత్తం ఇంటి తాళాలు పక్కనే ఉన్న సోదరుడు వెంకటేశ్వర్లుకు ఇచ్చి వెళ్లాడు. చేపలకు ఆహారం వేసేందుకు సోమవారం ఉదయం వెంకటేశ్వర్లు వెళ్లగా ఇంటి డోరుకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించాడు. ఫోన్ ద్వారా సోదరుడికి సమాచారం ఇవ్వగా ఇంటికి చేరుకున్నాడు. బీరువాలోని అరతులం బంగారు గాజులు, 10తులాల వెండితో పాటు నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మరో ఇంట్లో దొంగతనానికి యత్నం

పట్టణ కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన రాళ్లబండి సుధాకర్‌స్వామి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతా మేడ పైకి నిద్రించేందుకు వెళ్లారు. తెల్లవారుజాము సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. పక్కింట్లో నివాసం ఉండే చింతల రమేష్ శబ్దాలు విని కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. సుధాకర్‌స్వామి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఎలాంటి దొంగతనం జరగలేదని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కృత్రిమ గర్భధారణతో పశు సంపద వృద్ధి


మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

భువనగిరి : లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణతో పశు సంపద వృద్ధి చెందుతుందని నల్లగొండ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పశు సంవర్థక శాఖ కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేగంగా మేలు జాతి గేదెల సంతతి వృద్ధికి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారిత వీర్యం ఒక స్ట్రాకు రూ. 675 ఉంటుందని ప్రభుత్వం రూ. 425 సబ్సిడీ ఇవ్వగా రైతులకు కేవలం రూ. 250లకే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యానిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ వి కృష్ణ, డాక్టర్ ఐలయ్య, జిల్లా పశువైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర సూపర్‌వైజర్లు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ..

- విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి


ముకుంద్‌భాగ్ మృతదేహం

మాడుగులపల్లి : సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ ఓ వలస కూలీ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గండ్రవానిగూడెంలో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని నబరంగాపూర్ జిల్లా కోయిలీముండా గ్రామానికి చెందిన ముకుంద్‌భాగ్ (43) బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో ఆరు నెలల క్రితం గండ్రవానిగూడెం వచ్చి పరుచూరి సునీల్‌కు చెందిన ఇటుక బట్టీలో పనిచేస్తూ, అక్కడే ఓ గదిలో ఉంటున్నాడు. ముకుంద్‌భాగ్ తెల్లవారుజామున సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య కాలిమతిభాగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


సాయిరామ్ (ఫైల్)

మఠంపల్లి: మట్టపల్లి -హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై మఠంపల్లి మండలం పెదవీడు సమీపంలో గల గంగమ్మ గుడి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మఠంపల్లికి చెందిన సాయిరామ్ (28) మండలంలోని ఎస్‌సీఎల్ ఫ్యాక్టరీలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై మఠంపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన సాయిరామ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఎంపీటీసీపై కేసు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుపై వాట్సాప్ గ్రూపుల్లో అనుచిత వాఖ్యలతో పోస్టులు పెట్టిన ఎంపీటీసీ బెజ్జం సాయిపై కేసు నమోదైంది. టూటౌన్ సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. వాట్సాప్ గ్రూపులో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో అవి గ్రూపుల్లో వైరల్ అయ్యాయని బెజ్జం సాయిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సర్వేతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- లీఫ్స్ సంస్థ చైర్మన్, నల్సార్ యూనివర్సిటీ ఆచార్యుడు సునీల్‌కుమార్


కొప్పోలులో రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్న సునీల్‌కుమార్

గుర్రంపోడు : తెలంగాణలో భూములను సమగ్రంగా సర్వే జరిపితేనే రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని లీఫ్ సంస్థ చైర్మన్, భూమి చట్టాల నిపుణుడు, నల్సార్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఎం.సునీల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గుర్రంపోడు, పాల్వాయి, కొప్పోలు గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్న సందర్భంగా మాట్లాడారు. ధరణిలో ఉన్న లోపాల వల్ల కొత్త సమస్యలు వచ్చాయని, వాటికి తక్షణ పరిష్కారం చూపడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. తెలంగాణలో వాస్తవంగా ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి 60 లక్షల ఎకరాల తేడా ఉందని, దీనితో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. రైతుల అభిప్రాయాలు తెలసుకునేందుకు కారవాన్ యాత్ర నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఆయన వెంట సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ నిరూప్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, న్యాయవాదులు జీవన్, మల్లేష్, అభిలాష్, రవి, సందీప్ కరుణాకర్, లీఫ్ సంస్థ సలహాదారు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతలపాలెం మండలంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రేబల్లెకు చెందిన వీఆర్ఏ మట్టయ్య పాత రేబల్లె సమీపంలోని కష్ణానది రేవు వెంట తన గేదెల కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో తెల్ల తుమ్మ చెట్టుకు గుర్తుతెలియని సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ప్యాంటుతో ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. అతని ముఖము గుర్తుపట్టే వీలులేకుండా కుళ్లిపోయి ఉన్నది. ఘటన జరిగి సుమారు వారం రోజులు అయి ఉండవచ్చు అని ఎస్ఐ తెలిపారు. వీఆర్ఏ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

'భారత్ పే'లో లోన్లు ఇప్పిస్తానని టోకరా

మిర్యాలగూడ అర్బన్: చిరు వ్యాపారులను టార్గెట్‌గా చేసుకుని లోన్లు ఇప్పిస్తామని చెప్పి వారినుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఉదంతం సోమవారం మిర్యాలగూడలో వెలుగుచూసింది.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన వి.నాగేందర్, హనుమాన్‌పేటకు చెందిన జె.సుధీర్ , శాంతినగర్‌లోని గీతామందిర్‌కు చెందిన ఏ.ప్రసాద్‌లు గోల్డ్ వర్క్ కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నవారు. వీరికి తమ వ్యాపార లావాదేవిల్లో భాగంగా గతంలో భారత్‌పే యాప్‌లో పని చేసిన అజ్మీరాతండాకు చెందిన అజ్మీరా వినోద్‌నాయక్ పరిచయమయ్యాడు. వినోద్ వారి అవసరాలను గుర్తించి భారత్ పే లో రూ.6లక్షల 10 లక్షల వరకు లోను ఇప్పిస్తామని నమ్మబలికాడు. డాక్యుమెంట్ల కోసం డబ్బులు ఇవ్వాలని చెప్పి రెండు నెలల క్రితం నాగేందర్ నుంచి రూ.30వేలు, సుధీర్ నుంచి రూ.5వేలు, ప్రసాద్ నుంచి రూ. 25వేలు వసూలు చేశారు. రెండు నెలలు గడిచినా లోను రాలేదు. బాధితులు ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పక పోవడంతో మోస పోయామని గ్రహించి సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఇలా మరికొందరి వద్దకూడా తీసుకున్నాడని, బాధితులు సుమారు 20మంది వరకు ఉంటారని పేర్కొంటున్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

నల్లగొండ క్రైం : తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్పీ అపుర్వరావు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని రాజరాజేశ్వరిపేట జనగాం ప్రాంతానికి చెందిన శీలంశెట్టి వెంకటరమణ అలియాస్ శ్రీను కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతని తండ్రి నాగేశ్వర్ రావు విజయవాడలో రౌడీ షీటర్. దొంగతనాలు చేసుకుని బతకాలని వెంకటరమణను కొట్టి తండ్రి ఇంటినుంచి వెళ్లగొట్టాడు. వెంకటరమణ తణుకు వెళ్లి పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేశాడు. అక్కడి నుంచి వెళ్లి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న టీ,టిఫిన్ సెంటర్ రోడ్డు విస్తరణలో పోయింది. ఉపాధి కోల్పోవడంతో కరోనా సమయంలో భార్యతో కలిసి వెంకటరమణ జనగాంలో ఇస్త్రాకుల వ్యాపారం చేశాడు. పూట గడవక దొంగతనాలే వృత్తిగా ఎంచుకున్నాడు. పట్టణంలోని పానగల్ బైపాస్‌లో సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. విచారణలో నేరాలను అంగీకరించాడు. అతని వద్ద రూ.21లక్షల విలువైన 35 తులాల బంగారం, అరకిలో వెండి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఎస్సై జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఎస్సై లింగారెడ్డిలను ఎస్పీ అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

నార్కట్‌పల్లి : వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నార్కట్‌పల్లి, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్ చెందిన రెడ్డిగట్టు సతీష్‌కుమార్(29) నార్కట్‌పల్లిలో అద్దెకు ఉంటూ స్థానిక హెరిటేజ్ కంపెనీలో హెచ్ఆర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో సతీష్‌కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. అదే రోజు సాయంత్రంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కాసేపటికి భార్య గమనించి స్థానికుల సహాయంతో అతడిని ఆస్పత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రెడ్డిగట్టు యాదగిరి సోమవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదబాబు తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన ఎస్‌కె.యూసుఫ్(42) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా యూసుఫ్ మద్యానికి బానిసగా మారాడు. ఆటో తోలగా వచ్చే డబ్బులు సరిపోక నిత్యం భార్యతో గొడవపడేవాడు. ఆదివారం కూడా మద్యానికి డబ్బులు ఇవ్వాలని ఆమెతో ఘర్షణ పడటంతో సమీపంలో ఉన్న తమ్ముడి ఇంటికి వెళ్లింది. దీంతో అతను మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే మనస్తాపంతో ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఇంటి పక్కన వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొంతుతు సోమవారం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు జహింగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వేసవి దుక్కులు ఎంతో మేలు

- పెద్దవూర ఏఓ సందీప్

పాడి పంట


కల్టివేటర్ వేస్తున్న రైతు (ఫైల్)

పెద్దవూర: యాసంగి పంట కాలం పూర్తయితే మెట్ట భూములన్నీ ఖాళీగా ఉంటాయి. అయితే ఖాళీగా వదిలేయడం కంటే వేసవిలో దుక్కులు దున్నడం, భూసారం పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు.

దుక్కులతో ప్రయోజనాలు ఇలా..

- వేసవిలో దుక్కులు దున్నడం వలన భూమిలో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని గడ్డి పొరలు విడిపోయి భూమి గుల్లబారుతుంది.
- సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులు పెరుగుతాయి.
- కలుపు మొక్కలు నశిస్తాయి.
- భూమి సారవంతం అవుతుంది. ఎరువులు, పెస్టిసైడ్స్ తక్కువగా ఉపయోగంచడం వలన లాభాలు పొందే అవకాశాలు ఉంటాయి.
- లోతైన దుక్కుల వలన లోపలి వరకు భూమి పొరలుగా విడిపోయి మొక్కల వేళ్లు కూడా లోతు వరకు చేరుకునే అవకాశాలు మెరుగుపడతాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో ఉంటుంది.
- గత పంటకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది. గత పంటకు చెందిన అవశేషాలు, మొక్కల వేర్ల ద్వారా విష పదార్థాలు విడుదలైతే అవి పూర్తిగా నశిస్తాయి.
- వాలుకు అడ్డుగా దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురికాకుండా ఉంటుంది.
- వేసవిలో దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేస్తాయి. పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం వలన వీటి బెడద తగ్గుతుంది.
- ముందుగానే దుక్కులు దున్నడం వలన వానాకాలం పంటలు వేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.
- వేసవిలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకుని నేల తడిగా మారిన తర్వాత కనీసం 25 నుంచి 30 సెంటిమీటర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా రెక్క నాగలి, పల్లపు నాగలి ఉపయోగించాలి. యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటోవేటర్‌లు వినియోగించాలి. రెక్కల నాగలి పైకి వచ్చిన మట్టి పెళ్లలను కూడా పొడిగా మార్చేస్తుంది. రాళ్లు ఎక్కువగా ఉన్న చోట పల్లెపు నాగలి ఉపయోగించాలి. దున్నే సమయంలో మట్టి పెళ్లలు లేస్తే దంతె సేద్యం ద్వారా పొలాలు చదును చేసుకోవాలి. దీనివలన గతంలో పంట అవశేషాలు కూడా బయటకు వస్తాయి.అంతేకాకుండా వర్షపు నీరు భూమిలోకి తొందరగా ఇంకుతుంది. తద్వారా భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. నీరుపారి భూమి కోతకు గురికాకుండా నేలను వాలుకు అడ్డంగా దున్నాలి. దుక్కులు దున్నేటప్పుడే అందులో చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలపడం వల అవి మురిగి ఎరువుగా మారుతాయి.

- పంటలను ఆశించే పురుగులు ఇప్పుడు నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నడం కారణంగా పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారం కావడం లేదా ఎండకు చనిపోతాయి.
- శిలీంద్ర బీజాలు కూడా భూమి లోపల పొరల నుంచి బయటకు వస్తాయి.